
సాక్షి
కుమురం భీం
శుక్రవారం ౹ 15 ౹ మార్చి ౹ 2024



వస్తుసేవల్లో నాణ్యత తప్పనిసరి
సరైన ధర, తూకం, నాణ్యత, స్వచ్ఛత పొందే హక్కు వినియోగదారుడికి ఉంది. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.
IIలో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శుక్ర: 6:27	శని: 5:02

గరిష్ఠం/కనిష్ఠం
37.4 /26.6

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పడప్పుడు మేఘావృతమవుతుంది. పగలు వేడి తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి ఉష్ణోగ్రత కూడా పెరుగుతుంది.

సక్కుకే కారు టికెట్



ఆదిలాబాద్ పార్లమెంటరీ ముఖ్య నేతలతో మాట్లాడుతున్న కేసీఆర్

- రాజధానిలో పార్లమెంటరీ సమావేశం
- అనంతరం ప్రకటించిన గులాబీ బాస్
- ఇక ప్రజాక్షేత్రంలోకి వెళ్లాలని పిలుపు
- గెలుస్తామని పార్టీ క్యాడర్‌కు భరోసా

సాక్షి, ఆదిలాబాద్: బీఆర్‌ఎస్ ఆదిలాబాద్ లోకసభ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు పేరు ఖరారైంది. ఆ పార్టీ అధినేత కేసీఆర్ గురువారం పార్లమెంటరీ సమావేశం అనంతరం అభ్యర్థిని ప్రకటించారు. ముందునుంచీ పార్టీలో చర్చ సాగుతున్నట్లుగానే సక్కునే బరిలోకి దింపారు. సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న సక్కుకు గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆసిఫాబాద్ టికెట్ దక్కలేదు. అధినేత కేసీఆర్ అప్పట్లోనే పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ అభ్యర్థిగా అవకాశం కల్పిస్తానని హామీ ఇచ్చారు. దీంతో అప్పుడు ఆసిఫాబాద్ అభ్యర్థినిగా పోటీ చేసిన కోవ లక్ష్మికి సక్కు పూర్తి మద్దతు ఇచ్చి గెలిపించడంలో ప్రధాన పాత్ర వహించారు. దీంతో కేసీఆర్ ఇచ్చిన మాట నిలుపుకొంటూ సక్కును ఆదిలాబాద్ అభ్యర్థిగా ఖరారు చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

రెండుసార్లు ఎమ్మెల్యేగా..
ఆత్రం సక్కు రెండుసార్లు కాంగ్రెస్ నుంచి ఆసిఫాబాద్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2009లో మొదటిసారి, ఆ తర్వాత 2018లో మరోసారి హస్తం గుర్తుపై విజయం సాధించారు. రెండోసారి గెలుపొందిన తర్వాత ఆయన బీఆర్‌ఎస్‌లో చేరి కొనసాగుతున్నారు. కాగా, 2008లో ప్రభుత్వ ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరిన ఆత్రం సక్కు మరుసటి ఏడాది కాంగ్రెస్ అభ్యర్థిగా ఆసిఫాబాద్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి గెలుపొందారు. కాగా, ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి 2014, 2019 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా గోడం నగేశ్ బరిలో నిలిచారు. రెండు పర్యాయాల తర్వాత బీఆర్‌ఎస్ అధిష్టానం అభ్యర్థిని మార్చింది. ఈ పార్లమెంట్ స్థానం నుంచి 2008లో టీ మధుసూదన్‌రెడ్డి, 2014లో గోడం నగేశ్ బీఆర్‌ఎస్ నుంచి గెలుపొందారు. కాగా, బీజేపీ అభ్యర్థిగా ఎంపికైన గోడం నగేశ్, ప్రస్తుతం బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఎంపికైన ఆత్రం సక్కు ఇరువురు గోండు సామాజిక వర్గానికి చెందినవారే. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక ఎలా ఉంటుందనేదానిపై అందరి దృష్టి ఉంది.

సమావేశం తర్వాతే నిర్ణయం
బీఆర్‌ఎస్ ఆదిలాబాద్ పార్లమెంటరీ సమావేశం గురువారం హైదరాబాద్‌లో జరిగింది. మాజీ సీఎం కేసీఆర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్లమెంట్ పరిధిలోని ముఖ్య నేతలు హాజరయ్యారు. సమావేశంలో అభ్యర్థి ఎంపికకు సంబంధించి ముఖ్యనేతలు కేసీఆర్ నిర్ణయానికే వదిలేశారు. ఏ నిర్ణయానికైనా తాము కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. కాగా, సాయంత్రం అభ్యర్థి ప్రకటన వెలువడింది.

ఆత్రం సక్కు బయోడేటా



పేరు: ఆత్రం సక్కు
తల్లిదండ్రులు: మాన్కుబాయి, రాజు
జననం: 2.1.1973
భార్య: తులసి (ప్రభుత్వ ఉపాధ్యాయురాలు–టీడబ్ల్యూపీఎస్)
కుమారులు: వినోద్, అంకిత్, అన్వేశ్
కూతుళ్లు: దివ్యభారతి, హిమబిందు, జంగుబాయి
వయస్సు: 51 సంవత్సరాలు
విద్యార్హత: ఇంటర్మీడియట్
కులం: ఎస్టీ (గోండు)
వృత్తి: వ్యవసాయం
చిరునామా: లక్ష్మీపూర్ గ్రామం, గిన్నెధరి గ్రామపంచాయతీ, తిర్యాణి మండలం, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా.

ఐకేరెడ్డి, విఠల్‌రెడ్డి గైర్హాజరు
హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని ముఖ్యనేతలు, మాజీ మంత్రులు జోగు రామన్న, వేణుగోపాలాచారి, ఎమ్మెల్యేలు అనిల్‌జాదవ్, కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండే విఠల్, సీనియర్ నాయకులు అరిగెల నాగేశ్వర్‌రావు, రవీందర్‌రావు, సత్యనారాయణగౌడ్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, నేతలు భూక్యా జాన్సన్‌నాయక్, రమాదేవి, కిరణ్‌కుమార్, జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, రాంకిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అయితే మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి సమావేశానికి గైర్హాజరు కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. వీరు పార్టీ మారుతున్నారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో సమావేశానికి రాకపోవడం ఇందుకు మరింత బలాన్ని చేకూర్చింది. కాగా, ఇప్పటి వరకు ఆదిలాబాద్ పార్లమెంట్‌లో గులాబీ పార్టీ బలంగా ఉన్నట్లు కేసీఆర్ సమావేశంలో దిశానిర్దేశం చేశారు. గట్టిగా పోరాడితే ఈ స్థానం గెలుస్తామని భరోసా ఇచ్చారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఒంటిపూట బడి

కెరమెరి(ఆసిఫాబాద్): వేసవి దృష్ట్యా పాఠశాలల్లో శుక్రవారం నుంచి ఒంటి పూటే తరగతులు నిర్వహించనున్నారు. జిల్లాలో అన్ని యాజమాన్యాల కింద మొత్తం 1,263 పాఠశాలలు ఉండగా, దాదాపు 92 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పాఠశాలలు కొనసాగనున్నాయి. పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో మాత్రం మధ్యాహ్నం ఒంటిగంట నంఢచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు కొనసాగుతాయి.

జిల్లా ఉత్తమ అంగన్‌వాడీగా నీలాబాయి



అవార్డు అందుకుంటున్న నీలాబాయి

జైనూర్(ఆసిఫాబాద్): జైనూర్ మండలం జామినిలోని అంగన్‌వాడీ కేంద్రంలో పని చేస్తున్న లటపటే నీలాబాయి జిల్లా ఉత్తమ అంగన్‌వాడీ ఉద్యోగిగా ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ కమిషనర్ వాకాటి కరుణ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు



పరీక్ష కేంద్రం నుంచి ఆనందంగా బయటకు వస్తున్న విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో ఇంటర్మీడియెట్ ప్రధాన పరీక్షలు ముగిశాయి. చివరి రోజు ద్వితీయ సంవత్సరం కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలతో పాటు ఒకేషనల్ పరీక్షలు నిర్వహించారు. జిల్లాలో 19 సెంటర్లలో గురువారం నిర్వహించిన పరీక్షలకు 4,570 మంది విద్యార్థులకు 4,416 మంది హాజరు కాగా 154 మంది గైర్హాజరయ్యారని డీఐఈవో శంకర్ తెలిపారు. జనరల్ విభాగంలో 4,022 మందికి 3,900 హాజరు కాగా 122 గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 548 మందికి 516 హాజరు కాగా 32 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించడానికి కృషి చేసిన సిబ్బంది అభినందించారు. శుక్ర, శనివారాల్లో ఒకేషనల్ విద్యార్థులకు బ్రిడ్జి కోర్స్ పరీక్ష జరుగుతుందని తెలిపారు.

మహిళల భద్రతకు 'భరోసా'

ఆసిఫాబాద్‌అర్బన్: మహిళలు, పిల్లల భద్రత కోసమే భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని భరోసా కేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాధితులకు భరోసా కల్పిస్తూ, మహిళలు, పిల్లల సమస్యలు వేగంగా పరిష్కరించడమే లక్ష్యంగా సిబ్బంది పని చేయాలని సూచించారు. ఫిర్యాదులు అందిన వెంటనే సత్వర న్యాయం అందించాలన్నారు. అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాణాప్రతాప్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అధికారులతో మంత్రి సీతక్క సమీక్ష

కైలాస్‌నగర్/ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క శుక్రవారం కుమురంభీం, ఆదిలాబాద్ జిల్లాల్లో పర్యటించనున్నారు. మంత్రి పర్యటన షెడ్యూల్ వివరాలను ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా గురువారం ప్రకటించారు. శుక్రవారం ఉదయం 7.15 గంటలకు ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయ భవనాన్ని ప్రారంభించనున్నారు. అనంతరం 7.45 గంటలకు పెద్దవాగు వంతెనను పరిశీలించి 9 గంటలకు కెరమెరి మండలం జోడేఘాట్‌లోని కుమురంభీం మ్యూజియం సందర్శించనున్నారు. 10 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 11.30గంటలకు ఉట్నూర్ డివిజన్ కేంద్రానికి చేరుకుంటారు. 12.30గంటల వరకు స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొంటారు. భోజన విరామ అనంతరం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4గంటల వరకు ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లోని పీఎమ్మార్సీ భవనంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. అనంతరం తిరిగి హైదరాబాద్‌కు వెళ్లనున్నారు.

నిరుపేదల సంక్షేమానికి కృషి



మంత్రి సీతక్కకు సమస్యలు వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనప్ప

- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క
- కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే కోనప్ప, ఇన్‌చార్జి జెడ్పీ చైర్మన్ కృష్ణారావు



కృష్ణారావును ఆహ్వానిస్తున్న మంత్రి

కాగజ్‌నగర్‌రూరల్: నిరుపేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని వినయ్‌గార్డెన్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పతోపాటు ఇన్‌చార్జి జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్‌పర్సన్ షాహీనా సుల్తానా, వైస్ చైర్మన్ రాజేందర్, పలువురు ముఖ్య నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంత్రి మాట్లాడుతూ పేద ప్రజల కోసం త్యాగాలు చేసిన ఇందిరమ్మ కుటుంబానికి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పట్టం కట్టాలని కోరారు. రాష్ట్రాన్ని బీఆర్‌ఎస్ పార్టీ అప్పుల పాలు చేసిందని ఆరోపించారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంతో పాటు అభివృద్ధితో కూడిన సుపరిపాలన అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. జిల్లాలో పెండింగ్ అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తయ్యేవిధంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అందులో భాగంగానే అనేక శంకుస్థాపనలు చేసి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. సిర్పూర్ నియోజకవర్గంలోని మిగిలిన వంతెనలు, రహదారులు ఇతరాత్ర పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని, కాంగ్రెస్ పార్టీ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు మాట్లాడుతూ ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప చేరికతో బలం పెరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కోరారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, పార్టీ త్యాగాలకు మారుపేరని పేర్కొన్నారు.

పదవుల కోసం కాంగ్రెస్‌లోకి రావడం లేదు
బీఎస్పీ, బీఆర్‌ఎస్ పార్టీల పొత్తుతోనే బీఆర్‌ఎస్ నుంచి బయటికి వచ్చినట్లు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనపై పోటీ చేసిన ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ లేనిపోని ఆరోపణలు చేశారని ఆరోపించారు. ఆయనకు ఆలంపూర్‌లో ఆదరణ లేకనే ఇక్కడికి వచ్చి ఈ ప్రాంత బహుజనులను నట్టేటా ముంచినట్లు మండిపడ్డారు. పదవుల ఆశించి కాంగ్రెస్ పార్టీలోకి రావడం లేదని, నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడాలనే తపనతో చేరినట్లు వివరించారు. ఎస్పీఎం కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, ఆరె, బారె, మాలి కులస్తుల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్, ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖ్యానాయక్, నాయకులు భాస్కర్, శ్యాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

అందవెల్లి వంతెన పరిశీలన
కాగజ్‌నగర్ మండలంలోని అందవెల్లి వాగుపై నిర్మిస్తున్న వంతెనను మంత్రి సీతక్క పరిశీలించారు. నిర్మాణ పనులు ఆగిపోవడంతో 44 గ్రామాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, త్వరలోనే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎస్పీ సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ముందు జాగ్రత్తలతో అధిక దిగుబడులు




పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పిస్తున్న శివకృష్ణ కోట

- కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శివకృష్ణ కోట
- వ్యవసాయ శాఖ అధికారులకు అవగాహన

ఆసిఫాబాద్: పంటల రక్షణకు రైతులు ముందు జాగ్రత్తలు తీసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శివకృష్ణ కోట అన్నారు. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ రైతు వేదికలో గురువారం ఆసిఫాబాద్, సిర్పూర్ డివిజన్ల పరిధిలోని సహాయ వ్యవసాయ సంచాలకులు, ఏవోలు, ఏఈవోలకు వచ్చే వానాకాలంలో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. డాక్టర్ శివకృష్ణ కోట మాట్లాడుతూ గతేడాది నాగపూర్ జాతీయ పత్తి పరిశోధనా కేంద్రం సహకారంతో మంచిర్యాల జిల్లాలో 165 ఎకరాల్లో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేసినట్లు తెలిపారు. నేల రకాలు, విత్తన మోతాదు, విత్తే దూరం, మొక్కల సంఖ్య, అందుబాటులో ఉన్న రకాలు, పెరుగుదలను నియంత్రించే ఉత్ప్రేరకాల వాడకం, పోషకాల యాజమాన్యం, కలుపు చీడపీడల యాజమాన్యం గురించి వివరించారు. అధికారులు, శాస్త్రవేత్తలతో చర్చాగోష్ఠి నిర్వహించి సందేహాలు నివృత్తి చేశారు. ప్రస్తుతం యాసంగి వరి పంటలో సల్ఫైడ్ దుష్ప్రభావం, జింకులోపం, కాండం తొలుచు పురుగు ఉనికి గుర్తించామన్నారు. జగిత్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ విచక్షణా రహితంగా వాడుతున్న ఫాస్ఫారిక్ ఎరువులు, సరైన మురుగునీటి వ్యవస్థ లేకపోవడంతో ఈ సల్ఫైడ్ దుష్ప్రభావం ఏర్పడుతుందన్నారు. మొక్క వేరు వ్యవస్థ పూర్తిగా దెబ్బతిని గిడసబారి పోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. దీని నివారణకు పంట పొలాలకు ఆరుతడి పద్ధతిలో నీరందించాలని సూచించారు. డీఏవో శ్రీనివాసరావు మాట్లాడుతూ శాస్త్రవేత్తల సూచనల మేరకు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ తిరుపతి, నాగరాజు, ఏవో మంజుల, ఏఈవో రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

ఆసిఫాబాద్: పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలని డీఆర్వో లోకేశ్వర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం డీపీవో భిక్షపతిగౌడ్, డీఎస్పీ సదయ్య, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్లు భుజంగరావు, అంజయ్యతో కలిసి ముస్లిం మత పెద్దలు, మసీద్ కమిటీ సభ్యులతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ రంజాన్ మాసం ప్రారంభమైన నేపథ్యంలో మసీదుల వద్ద పారిశుధ్యం, విద్యుత్ సరఫరా, తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. ప్రార్థనల సమయంలో మసీదుల వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లోని మసీదుల వద్ద పారిశుధ్య పనులు చేపట్టేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. నిరంతరాయ విద్యుత్ సరఫరాతో పాటు తాగునీటి ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సాయంత్రం ప్రార్థనా సమయంలో పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో జిల్లా మైనార్టీ సంక్షేమ ఇన్‌చార్జి అధికారి సజీవన్, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్వో లోకేశ్వర్‌రావు

కల సాకారం..

- రూ.1.5 కోట్లతో జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణం
- నేడు మంత్రి సీతక్క చేతుల మీదుగా ప్రారంభం
- హర్షం వ్యక్తం చేస్తున్న నిరుద్యోగులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో నిరుద్యోగుల కష్టాలు తొలగిపోనున్నాయి. నూతనంగా నిర్మించిన జిల్లా గ్రంథాలయ భవనం నేటి నుంచి అందుబాటులోకి రానుంది. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే శుక్రవారం జిల్లా గ్రంథాలయ నూతన భవనాన్ని ప్రారంభించనున్నారు. పాత భవనంలో అవస్థలు పడిన నిరుద్యోగులకు వసతులతో కూడిన భవనం అందుబాటులోకి రానుంది. ఏళ్లుగా ఎదురు చూస్తున్న కల సాకారం అవుతుండటంతో యువతీ యువకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిర్మాణం ఇలా..
జిల్లా కేంద్రంలోని గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరడంతో పాఠకులు, నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో నూతన జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. రూర్బన్ పథకంలో భాగంగా చిర్రకుంట క్లస్టర్ కింద రూ.1.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి. 2020లో పనులు ప్రారంభించగా కరోనా కారణంగా మందకొడిగా సాగాయి. ఇప్పటివరకు సివిల్ పనులకు రూ.1.30 కోట్లు ఖర్చు చేయగా.. ఫర్నిచర్లకు రూ.15 లక్షలు, పుస్తకాల కోసం రూ.5 లక్షలు వెచ్చించినట్లు అధికారులు వెల్లడించారు. 10 గుంటల విస్తీర్ణంలో జీ ప్లస్ 1 పద్ధతిలో గ్రంథాలయ భవనం నిర్మించారు. ఇందులో రెండు అంతస్తుల్లో మొత్తం 10 గదులు ఉన్నాయి. పాఠకుల కోసం 4 గదులు కేటాయించగా, చైర్మన్, సెక్రటరీ, లైబ్రేరియన్, స్టోర్, స్టాఫ్ ఒక్కో గది చొప్పున కేటాయించారు.



పాఠకుల కోసం గది


వేసవి నేపథ్యంలో ఇబ్బందులు లేకుండా ఐదు ఏసీలు, ఒక వాటర్ కూలర్ ఏర్పాటు చేస్తున్నారు. యువతీయువకుల కోసం వేర్వేరుగా రెండు మరుగుదొడ్లు నిర్మించారు. త్వరలోనే ప్రహరీ నిర్మించడంతోపాటు పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయనున్నారు.

డీఎస్సీకి సిద్ధమవుతున్నా



జిల్లా గ్రంథాలయం నిరుద్యోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రస్తుతం డీఎస్సీకి దరఖాస్తు చేసి పరీక్షకు సిద్ధమవుతున్నా. మార్కెట్‌లో మెటీరియల్ కొనాలంటే అధిక ధరలు ఉన్నాయి. గ్రంథాలయంలో పోటీ పరీక్షల మెటీరియల్ అందుబాటులో ఉంచాలి.
– శివప్రియ, బీఎస్సీ బీఈడీ, ఆసిఫాబాద్

సద్వినియోగం చేసుకోవాలి



జిల్లా కేంద్రంలోని నూతన గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. నిరుద్యోగులు, పాఠకులకు అవసరమైన మెటీరియల్ అందుబాటులో ఉంటుంది. అన్నిరకాల పుస్తకాలు తెప్పిస్తాం. పూర్తి వసతులతో గ్రంథాలయం నేటి నుంచి ప్రారంభమవుతుంది.
– సదానందం, లైబ్రేరియన్

నేడు గ్రంథాలయం ప్రారంభం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన జిల్లా గ్రంథాలయ భవనాన్ని శుక్రవారం ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) ప్రారంభిస్తారని, ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అధికారులను ఆదేశించారు. గ్రంథాలయ భవనాన్ని గురువారం అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి సందర్శించారు. పాఠకులకు కోసం ఏర్పాటు చేసిన రీడింగ్, రైటింగ్ కుర్చీలు, టేబుళ్లను పరిశీలించారు. పెండింగ్ పనులు ఉంటే పూర్తి చేసి, ప్రారంభానికి సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగులకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచాలన్నారు. వారి వెంట డీఆర్‌డీవో సురేందర్, మున్సిపల్ కమిషనర్ భుజంగ్‌రావు తదితరులు ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలి

ఆసిఫాబాద్: నూతన విద్యాసంవత్సరం 2024- 25 ప్రారంభానికి ముందే అన్ని బడుల్లో పూర్తిస్థాయి వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, విద్యాశాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సీఎస్ మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి ఏప్రిల్ 10 వరకు పదో తరగతి వార్షిక పరీక్షలు ఉంటాయని, ఈ విద్యాసంవత్సరం ముగింపు అనంతరం వేసవి సెలవులు 45 రోజుల పాటు ఉంటాయని తెలిపారు. పాఠశాలల్లో అవసరమైన మరమ్మతులు చేపట్టడంతోపాటు వసతుల కల్పనపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ సకాలంలో జరిగేలా చూడాలన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీఈవో అశోక్‌తో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ వేసవి సెలవుల సమయంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మూత్రశాలలు, భోజనశాలలు, వంటశాలలు, ట్యాంక్ నిర్మాణం, తరగతి గదుల మరమ్మతులు, అదనపు తరగతి గదుల ఏర్పాటుకు అవసరమైన పాలనాపరమైన అనుమతులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, డీఆర్‌డీవో సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులు

క్లుప్తంగా

ఫోన్ అప్పగింత

దండేపల్లి: మండలంలోని వెల్గనూర్‌కు చెందిన చుంచు అశోక్ ఫోన్ గతేడాది మే 31న పెద్దపల్లిలో చోరీకి గురికావడంతో దండేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీస్‌లు ట్రేస్ ఔట్ చేయగా కరీంనగర్‌లో ఓ వ్యక్తి వినియోగిస్తున్నట్లు తెలిసింది. పోలీసులు అతనికి ఫోన్ చేయగా పోలీస్ స్టేషన్‌లో అప్పగించాడు. ఎస్సై స్వరూప్‌రాజ్ గురువారం అశోక్‌కు ఫోన్ అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది గంగ్యా నాయక్, సంతోష్ నాయక్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం


సంధ్యారాణి(ఫైల్)

వాంకిడి: మండల కేంద్రంలోని లక్ష్మీనగర్ కాలనీకి చెందిన ఖోబ్రగడె సంధ్యా రాణి (23) అదృశ్యమైనట్లు ఎస్సై సాగర్ తెలిపారు. కాలనీకి చెందిన ఖోబ్రగడె సంజీవ్ కుమార్తె మండల కేంద్రంలోని ఓ బట్టల దుకాణంలో పనిచేస్తోంది. బుధవారం సైతం బట్టల దుకాణానికి వెళ్లింది. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. ఫోన్ కూడా స్విచ్‌ఆఫ్ ఉండడంతో గురువారం యువతి తండ్రి సంజీవ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రెండిళ్లలో చోరీ

నస్పూర్: పట్టణ పరిధిలోని అభినవ కాలనీలోని రెండిళ్లలో చోరీ జరిగినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు. కాలనీలో నివాసం ఉండే హెడ్ కానిస్టేబుల్ స్వామిదాస్ బుధవారం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి ఊరికి వెళ్లాడు. గురువారం వచ్చే సరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా రెండున్నర తులాల బంగారం, రూ.50 వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. స్వామిదాసు ఇంటిపక్కన గల కొమురయ్య ఇంటికి సైతం తాళం వేసి ఉండడంతో ఇంటి ముందు నిలిపి ఉన్న బైక్ ఎత్తుకెళ్లారు. స్వామిదాసు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వైద్య కళాశాలలో పోస్టులకు ఇంటర్వ్యూ

ఆసిఫాబాద్: జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఒప్పంద/గౌరవ వేతన పద్ధతిలో వివిధ విభాగాల్లో పని చేసేందుకు అర్హత గల అభ్యర్థులకు ఈ నెల 16న ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు కళాశాల పిన్సిపల్ నాగార్జున రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 22 ప్రొఫెసర్, 27 అసోసియేట్ ప్రొఫెసర్లు, 48 అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 27 సీనియర్ రెసిడెంట్స్ విభాగాల్లో అటీనమీ, ఫిజియాలజీ, బయో కెమిస్ట్రీ, ఫార్మకాలజీ, పాథాలజీ, మైక్రో బయాలజీ, ఫోరం సిక్ మెడిసిన్, కమ్యూనిటీ మెడిసన్, జనరల్ మెడిసన్, పీడియాట్రిక్స్, డెర్మటాలజీ, వెనరాజలీ, సైక్రియాట్రా, జనరల్ సర్జరీ, ఈఎన్‌టీ, ఆప్తాల్మలజీ, ఆర్థోపెడిక్స్ అండ్ గైనకాలజీ, అనస్తిసియా, రేడియాలజీల్లో అర్హులైన అభ్యర్థు నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఆసక్తి కల అభ్యర్థులు స్వీయ ధ్రువీకరణ ప్రతులను జతపరచి ఈ నెల 16న ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు www.gmckumurambheemasifabad.org వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

గురుకుల డిగ్రీ ప్రవేశాలకు నోటిఫికేషన్

మంచిర్యాలటౌన్: తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీ గురుకుల డిగ్రీ కళాశాలల్లో 2024–2025 విద్యా సంవత్సరానికి గానూ డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి నిర్వహించనున్న ఉమ్మడి ప్రవేశ పరీక్ష టీజీఆర్‌డీసీ–సెట్ 2024 నోటిఫికేషన్ విడుదలైనట్లు ఆదిలాబాద్ రీజినల్ కోఆర్డినేటర్ కే. స్వరూపరాణి తెలిపారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డి.సుమతితో కలిసి ఆవిష్కరించారు. ఏప్రిల్ 12లోగా దరఖాస్తు చేసుకుంటే 28న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ఆర్సీవో తెలిపారు.

వస్తుసేవల్లో నాణ్యత తప్పనిసరి

వస్తు వినిమయ వ్యవస్థలో వినియోగదారుడికే సర్వహక్కులు ఉంటాయి. కొనే ప్రతి వస్తువులోనూ, సేవలోనూ లోపం లేకుండా సరైన ధర, తూకం, నాణ్యత, స్వచ్ఛత కలిగినవి పొందే హక్కు వినియోగదారుడికి ఉంది. కానీ ప్రస్తుత కాలంలో మోసాలు ఎక్కువయ్యాయి. తూనికలు, కొలతల్లో భారీగా తేడాలు ఉంటున్నాయి. వీటిపై ఎవరైనా ప్రశ్నిస్తే, నిలదీస్తే తప్ప న్యాయం జరగడం లేదు. వస్తుసేవల్లో నాణ్యత కొరవడినా, నష్టపోయినా.. ఆధారాలతో ఫిర్యాదుచేస్తే తగిన పరిహారం పొందవచ్చు. నేడు ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం..

- వస్తువు తయారీలో ప్రమాణాలు పాటించాల్సిందే
- కొనుగోలు సమయంలో అప్రమత్తత అవసరం
- ఫిర్యాదులకోసం వినియోగదారుల ఫోరమ్
- నేడు ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం


జిల్లా కేంద్రంలోని ఓ మాల్‌లో నిత్యావసరాలు కొనుగోలు చేస్తున్న వినియోగదారుడు

నిర్మల్‌ఖిల్లా/పాతమంచిర్యాల: 1983 నుంచి ఏటా మార్చి 15న ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం నిర్వహించుకుంటున్నాం. మనదేశంలో వినియోగదారుల హక్కుల పరిరక్షణకు 1986లో రూపొందించిన చట్టం డిసెంబర్ 24, 1987 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చింది. 2019 చట్టంతో దాన్ని మరింత పటిష్ట పరిచారు. కేంద్ర రక్షణ ప్రాధికార సంస్థ కూడా 2020లో ఏర్పాటైంది. వినియోగదారుల సౌలభ్యం కోసం వివిధ స్థాయిలో కమిషన్లు ఏర్పాట్లు చేశారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో కమిషన్లు పని చేస్తున్నాయి.

చట్టంలోని అంశాలు ఇవీ...

భారత ప్రభుత్వం 1986లో వినియోగదారుల రక్షణకు ఒక విప్లవాత్మకమైన చట్టాన్ని తెచ్చింది. అదే వినియోగదారులు హక్కుల పరిరక్షణ చట్టం. ఈ చట్టాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం 'రీడ్రసల్ ఫోరమ్స్'ను ప్రతీ జిల్లా కేంద్రంలోను ఏర్పాటు చేశారు. ఇవి జిల్లా, రాష్ట్ర, కేంద్ర స్థాయి ఫోరమ్స్‌గా విభజించారు. జిల్లా స్థాయి కేంద్రానికి రిటైర్డ్ జిల్లా జడ్జి అధ్యక్షుడిగా, మరో ఇద్దరు మెంటర్లుగా ఉంటారు. మెజారిటీ కమిటీ సభ్యుల ఆమోదంతో ఫోరంలోని కేసులపై తీర్పు ఇస్తారు. వస్తువు లేదా సేవ విలువ, కోరే నష్ట పరిహారం రూ.లక్ష వరకు అయితే కోర్టు ఫీజు రూ.100, రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు రూ.200, రూ.10 లక్షల వరకు రూ.400, రూ.10 లక్షల పైన అయితే రూ.500 నామమాత్రపు కోర్టు ఫీజు మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. జిల్లా వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేసిన తర్వాత ఫిర్యాదుదారుడు, ప్రతివాదుల మధ్యవర్తిత్వం నడిపి పరిష్కరించడానికి కృషి చేస్తారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఇది అందుబాటులో ఉంది. జిల్లా వినియోగదారుల కమిషన్ తీర్పును 45 రోజుల లోపల రాష్ట్ర కమిషన్‌కు అప్పీలు చేసుకోవచ్చు. జిల్లా కమిషన్ తీర్పును అనుసరించి వ్యాపారి, విక్రయదారుల ఆస్తులు జప్తు చేసే అధికారం ఉంటుంది. వస్తువులను అమ్మినవారు, డీలర్, ఉత్పత్తిదారులు ఇందులో బాధ్యులవుతారు.

కేంద్ర వినియోగదారుల పరిరక్షణ సంస్థ

జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో వినియోగదారుల కమిషన్ తోడుగా కేంద్ర వినియోగదారుల పరిరక్షణ సంస్థ చట్టంలో ఉన్న ముఖ్యమైన భాగం ఆన్‌లైన్, ఈ మెయిల్ ద్వారా, రాతపూర్వకంగా నేరుగా సంస్థకు ఫిర్యాదు చేయవచ్చు. పరిష్కరించిన కేసును జాతీయ కమిషన్‌లో మాత్రమే అప్పీల్‌కు అవకాశం ఉంటుంది. టోల్‌ఫ్రీ నంబర్ 18004250626 లేదా ఉమ్మడి జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఆదిలాబాద్ కార్యాలయం, 08732–22078లో సంప్రదించవచ్చు .

ఫిర్యాదు ఎప్పుడు చేయాలంటే?

ఒక వ్యాపారి, డీలర్ ద్వారా గానీ వినియోగదారుడు నష్టపోయి ఉంటే సదరు వ్యక్తిపై లేదా సంస్థపై ఫిర్యాదు చేయవచ్చు. వస్తువులో లేదా ప్రొడక్ట్ ఒకటి అంతకంటే ఎక్కువ లోపాలు ఉన్నప్పుడు సర్వీసు విషయంలో డీలర్ అశ్రద్ధ చేసేటప్పుడు, అసలు ధర కంటే ఎక్కువ వసూలు చేసినప్పుడు, ఇతర విధంగా నష్టపోయినా ఫిర్యాదు చేయవచ్చు.

హక్కుల గురించి తెలుసుకోవాలి



వినియోగదారుడు వస్తువును కొనుగోలు చేసే ముందు నాణ్యతను పరిశీలించాలి. తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలి. నాసిరకం వస్తువులపై, మోసపూరిత వ్యాపారులపై వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించడానికి వెనుకాడవద్దు. ప్రతిఒక్కరూ తమకున్న హక్కుల గురించి తెలుసుకోవాలి. మోసాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలి. ఉమ్మడి జిల్లా కేంద్రంలో వినియోగదారుల ఫోరం ఉంది. నిర్మల్, మంచిర్యాల, కుమురంభీం జిల్లా కేంద్రాల్లో కూడా ఏర్పాటుచేస్తే సత్వర న్యాయం మరింత అందుబాటులోకి లభిస్తుంది.

– సింగరి లింగయ్య, న్యాయవాది, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, నిర్మల్

ఆశ్రమ పాఠశాల తనిఖీ


విద్యార్థులతో మాట్లాడుతున్న నీలాదేవి

జన్నారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలను గురువారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు కుస్రం నీలాదేవి తనిఖీ చేశారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులు, వంట గదులను పరిశీలించారు. విద్యార్థుల చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలని, మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. ఆమె వెంట ఏటీడీవో చిరంజీవి, డీటీడీవో గంగారాం, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు ఉన్నారు.

108 అంబులెన్సు తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న సామ్రాట్

లక్సెట్టిపేట(మంచిర్యాల): మండల కేంద్రంలోని 108 అంబులెన్సును గురువారం ప్రోగ్రాం అధికారి సామ్రాట్ తనిఖీ చేశారు. వాహనంలోని పరికరాలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర సేవలలో రోగులకు సేవలందించాలని, ఎలాంటి ఇబ్బందులున్నా తెలియజేయాలన్నారు. ఫోన్ కాల్ రాగానే జాప్యం చేయకుండా సంఘటనస్థలానికి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మేనేజర్ సంపత్, పైలట్‌లు అనిల్, సత్యం, గంగన్న, తిరుపతి పాల్గొన్నారు.

15 మంది సీఐలు బదిలీ

మంచిర్యాలక్రైం: మల్టీజోన్–1 పరిధిలో పని చేస్తున్న 15మంది సీఐలు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఐజీ రంగనాథ్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు సీఐలు ఉన్నారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఐ.సైదారావ్	వెయిటింగ్ మల్టీ జోన్–1	ఖానాపూర్
డీ. మోహన్	ఖానాపూర్	శ్రీరాంపూర్
టీ.బన్సీలాల్	శ్రీరాంపూర్	మంచిర్యాల
ఎస్‌పీ.రవీందర్	మంచిర్యాల	సీసీఎస్ కరీంనగర్
పీ.ప్రసాద్	వెయిటింగ్ మల్టీజోన్–1	డీసీఆర్‌బీ ఆదిలాబాద్
సీహెచ్.నటేష్	డీసీఆర్‌బీ ఆదిలాబాద్	మల్టీజోన్–1 కార్యాలయం



పోతన్‌పల్లి అడవిలో చెట్ల నరికివేత

- ఆలస్యంగా వెలుగులోకి


మిషన్‌తో కట్ చేసిన ఇప్పచెట్టు

భీమారం: మంచిర్యాల అటవీ డివిజన్ పరిధిలోని భీమారం మండలం పోతన్‌పల్లి అడవిలో గుర్తు తెలియని వ్యక్తులు పెద్ద ఎత్తున చెట్లను నరికివేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మాంతమ్మ సమీపంలోని ఎర్రచెరువు పక్కనే వివిధ జాతులకు చెందిన చెట్లను మిషన్‌తో కట్ చేశారు. మంచిర్యాల–చెన్నూర్ జాతీయ రహదారికి కేవలం 300 మీటర్ల లోపల అడవిలో ఈ నరికి వేత జరిగింది. ఈ ప్రాంతంలోనే ఫారెస్ట్ వాచర్లు కాపలా ఉంటున్నారు. గతంలో ఈ ప్రాంతంలోనే పోడు వ్యవసాయం కోసం చెట్లను నరికిన సంఘటనలున్నాయి. మళ్లీ జాతీయ రహదారికి కూతవేటు దూరంలోనే వృక్షాలు నేల మట్టం కావడం పలు అనుమానాలకు తావిస్తోంది.

సింగరేణిలో బీసీ లైజన్ అధికారి


మాట్లాడుతున్న బాజీసైదా

శ్రీరాంపూర్: సింగరేణిలో ప్రత్యేకంగా బీసీ లైజన్ అధికారిని నియమిస్తున్నారని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి బాజీసైదా తెలిపారు. గురువారం ఎస్సార్పీ ఓసీపీ గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఇటీవల హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో సింగరేణి అతిథి గృహం ప్రారంభం సందర్భంగా బీసీ లైజన్ అధికారిని ఏర్పాటు చేయాలని డెప్యూటీ సీఎం కంపెనీకి ఆదేశాలిచ్చిరన్నారు. దీనిపై తమసంఘం హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. దీని వలన బీసీలకు మరింత ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు చంద్రమోహన్, గండి సతీశ్, ఐఎన్టీయూసీ నాయకులు జాన్సన్, టీబీజీకేఎస్ నాయకులు కందుల శంకర్, సురేశ్, ఇతర బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలలో పోస్టుల భర్తీ

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాల, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కాంట్రాక్టు పద్ధతిలో పోస్టులు భర్తీ చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సులేమాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం ఈ నెల 16న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రొఫెసర్ 9, అసిస్టెంట్ ప్రొఫెసర్ 16, అసోసియేట్ ప్రొఫెసర్ 23, సీనియర్ రెసిడెంట్ 18, ట్యూటర్ 21 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. వివరాలకు www.gmcmancherial.org వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

భూసేకరణలో అక్రమాలపై విజిలెన్స్ విచారణ

జైపూర్: శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్టు విస్తరణలో భాగంగా జైపూర్ మండలం దుబ్బపల్లిలో జరిగిన భూసేకరణలో అధికారులు గత బీఆర్‌ఎస్ పార్టీ నాయకులతో కుమ్మక్కై అవినీతికి పాల్పడ్డారంటూ స్థానికులు ప్రజావాణి కార్యక్రమంలో ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేయగా రాష్ట్ర విజిలెన్స్ ఉన్నతాధికారులు కలెక్టర్ సంతోష్‌ను విచారణ జరిపించి నివేదిక అందించాలని కోరారు. దీంతో దుబ్బపల్లిలో భూసేకరణలో జరిగిన అక్రమాలపై అడిషనల్ కలెక్టర్ రాహుల్‌ను విచారణ అధికారిగా నియమించారు.

'కాంట్రాక్ట్ కార్మికుల పనివేళలు మార్చాలి'


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రామకృష్ణాపూర్(చెన్నూర్): పట్టణంలోని సింగరేణి సివిల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల పనివేళలు మార్చాలని ఐఎఫ్‌టీయూ అనుబంధ కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం గురువారం సివిల్ డీవైఎస్‌ఈకు వినతిపత్రం అందించారు. ఎండ తీవ్రతలను దృష్టిలో ఉంచుకుని పనివేళలు మార్చాలని, కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గజ్జి మల్లేశ్, వెంకటేష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల పరిష్కారంపై దృష్టి సారించాలి

చెన్నూర్: చెన్నూర్ కోర్టులో ఈ నెల 16న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో పెండింగ్ కేసుల పరిష్కారంపై పోలీసులు దృష్టి సారించాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి పర్వతపు రవి అన్నారు. గురువారం కోర్టులో లోక్ అదాలత్ విజయవంతం కోసం పోలీసు అధికారులతో సమన్వయం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో క్రిమినల్ కేసులతోపాటు డ్రంక్ అండ్ డ్రైవ్, ర్యాష్ డ్రైవింగ్, మోటార్ వెహికిల్ యాక్ట్ కేసుల్లో రాజీకి ప్రయత్నించాలని తెలిపారు. జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రావు, సీఐలు, ఎస్సైలు, ఏఎస్సైలు, కోర్టు కానిస్టెబళ్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలని నిరసన


ప్రదర్శనలో సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు

పాతమంచిర్యాల: ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అఖిల భారత కేత్ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి లాల్‌కుమార్ మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం హామీనిచ్చి రెండేళ్లు గడుస్తున్నా అమలుకు నోచుకోలేదని తెలిపారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి బ్రహ్మానందం, రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు సంకె రవి, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శులు ఆర్.తిరుపతి, దొండ ప్రభాకర్, పీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి అందె మంగ, జిల్లా అధ్యక్షురాలు జ్యోతి పాల్గొన్నారు.

మూసివేసిన బొగ్గు గనులు పరిశీలన


మ్యాప్‌ను పరిశీలిస్తున్న ప్రొఫెసర్

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో మూసివేతకు గురైన పలు గనులను గురువారం ఐఐఈఎస్‌టీ కోల్‌కత్తా ప్రొఫెసర్ సుదీప్తా మహోపాధ్యాయ్, కార్పొరేట్ ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఎంవీకే 1, ఎంవీకే 5, బోయపల్లి గనులను తనిఖీ చేశారు. మూతబడిన గనులను మినిస్ట్రీ ఆఫ్ కోల్ నియమాల ప్రకారం సింగరేణి చేపట్టిన చర్యలను పరిశీలించారు. తాత్కాలిక గనుల మూసివేత ప్రణాళికలను గోలేటి లోని జీఎం కార్యాలయంలో ఏరియా అధికారులతో కలిసి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఏరియా జీఎం రవి ప్రసాద్, ప్రాజెక్టు అధికారి ఉమాకాంత్, ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ అడిషనల్ మేనేజర్ వెంకటరమణ, సర్వే అధికారి (కార్పొరేట్) నరేష్, డీజీఎం కృష్ణమూర్తి, బీపీఏ ఓసీపీ–2 మేనేజర్ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులు

మంచిర్యాలటౌన్: తెలంగాణ రాష్ట్ర స్టడీ సర్కిల్, మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 2024–25 విద్యా సంవత్సరంలో యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ 2025 పరీక్ష కోసం 100 మంది మైనార్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్‌లో మొదటిసారి ప్రవేశం పొందే అభ్యర్థులు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశం పూర్తిగా మెరిట్ ప్రాతిపదికన ఉంటుందన్నారు. మహిళా అభ్యర్థులకు 33.33 శాతం, అన్ని రిజర్వ్ కేటగిరీల్లో దివ్యాంగులకు 5 శాతం సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 12 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 040–23236112 నంబరులో సంప్రదించాలన్నారు.

ఉచిత శిక్షణ, ఉద్యోగ కల్పనకు దరఖాస్తులు

హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్, ఫైనాన్స్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ద్వారా బ్యాంకింగ్, ఫైనాన్స్‌లలో ఉచిత శిక్షణ, ఉద్యోగ కల్పన కోసం వెనుకబడిన తరగతులకు చెందిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి వినోద్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పరిధిలోని డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులకు 2 నెలల నాన్ రెసిడెన్షియల్ ఉచిత శిక్షణ అందించి, ప్రైవేటు బ్యాంక్‌లలో ఉద్యోగాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ నెల 25లోగా ఆన్‌లైన్‌లో www.tsbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఈ నెల 31వ తేదీన ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్టు ఉంటుందని, అందులో వచ్చిన మార్కుల ఆధారంగా 30 మంది అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

ఎస్టీటీ శిక్షణకు దరఖాస్తులు

డీఎస్సీ ఎస్జీటీ ఉచిత శిక్షణ కోసం ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని అర్హులైన అభ్యర్థులకు 75 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 22లోగా అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 08732–221280, 9949684959 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కాంగ్రెస్ వైపు కౌన్సిలర్ల అడుగులు..!

- ఎమ్మెల్యేల అనుచరులతో మంతనాలు
- భవిష్యత్‌ను చక్కదిద్దుకునే బాటలో ప్రయత్నాలు

బెల్లంపల్లి: బీఆర్‌ఎస్ పార్టీకి సామూహికంగా రాజీనామా చేసిన 20మంది బెల్లంపల్లి మున్సిపల్ కౌన్సిలర్లు తమ రాజకీయ భవిష్యత్‌ను చక్కదిద్దుకునే ప్రయత్నంలో నిమగ్నమయ్యారు. కాంగ్రెస్ పార్టీలో చేరికకు ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు సంప్రదిస్తున్నా పట్టు వీడకుండా ఐక్యతను కొనసాగిస్తున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్‌చైర్మన్ బత్తుల సుదర్శన్‌పై గత జనవరి 12న అవిశ్వాసం ప్రకటించిన అనంతరం చోటు చేసుకున్న పరిణామాల మధ్య రాజీనామా చేయడం తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఓటమి తర్వాత రాజీనామాలు కలకలం రేపాయి. వెంటనే రంగంలోకి దిగిన ఎమ్మెల్సీ దండె విఠల్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ కౌన్సిలర్లతో వేర్వేరుగా సమావేశమై బుజ్జగించినా మెత్తబడలేదు. రెండ్రోజులక్రితం బీఆర్‌ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ కరీంనగర్‌కు పిలిపించుకుని తన గెలుపునకు కృషి చేయాలని కోరినట్లు సమాచారం. బెల్లంపల్లికి వచ్చి అందరితో మాట్లాడి రాజకీయ భవిష్యత్‌కు అభయం ఇస్తానని భరోసా ఇవ్వగా కౌన్సిలర్లు ససేమిరా అంటున్నట్లుగా ప్రచారం జరుగుతోంది.

అధికార పార్టీ వైపు మొగ్గు

కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల ముందు కొందరు కాంగ్రెస్‌లో చేరగా.. మెజార్టీ కౌన్సిలర్లు దుర్గం చిన్నయ్య ఆదేశాలకు కట్టుబడి పని చేశారు. ఎన్నికల్లో ఆశలు కల్పించి తీరా మొండిచేయి చూపారనే విమర్శలున్నాయి. అధికారం కోల్పోయిన పార్టీలో రాజకీయ ఎదుగుదల ఉండదని, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా కాంగ్రెస్‌లో చేరడమే ఉత్తమమనే అభిప్రాయానికి వచ్చినట్లు ఇరువురు కౌన్సిలర్లు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తుండడం గమనార్హం. ఎంపీ ఎన్నికల నోటిఫికేషన్ రాకముందు గానీ, వచ్చిన వెంటనే గానీ కాంగ్రెస్ కండువా కప్పుకోవాలనే నిర్ణయానికి వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయంలో బెల్లంపల్లి, చెన్నూర్ ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, వివేక్‌లతో అనుయాయుల ద్వారా మంతనాలు సాగిస్తున్నట్లు చెబుతున్నారు.

చిన్నయ్యపై కోపంతోనే..

అసెంబ్లీ ఎన్నికల్లో ఎంత కష్టపడినా దుర్గం చిన్నయ్య పోలింగ్ బూత్ ఖర్చులు కూడా ఇవ్వలేదని కౌన్సిలర్లు బహిరంగంగానే అక్కసు వెళ్లగక్కుతున్నారు. దళితబంధు వర్తింపజేయకుండా, డబుల్‌బెడ్రూం ఇళ్లు పంపిణీ చేయకుండా తీవ్రంగా నష్టపర్చారని ఆవేదన చెందుతున్నారు. ఆయనపై కోపంతోనే కాంగ్రెస్‌లో చేరాలని ఏకాభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం.

ఎస్‌హెచ్‌జీ సభ్యులకు ఇన్సూరెన్స్ స్కీమ్ అమలు

- ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున
- బ్యాంక్ లింకేజీ ప్రోగ్రాం కింద సభ్యులకు క్రెడిట్ లింక్డ్ రిస్క్ కవరేజీ వర్తింపు
- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 64.35 లక్షల మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులకు (గ్రామీణ, పట్టణ) ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ స్కీమ్‌ను అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రమాదవశాత్తూ ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు మరణించిన పక్షంలో ఈ ప్రమాద బీమా వర్తించేలా చర్యలు చేపట్టనున్నారు. ఈ ఇన్సూరెన్స్ స్కీమ్ గురువారం నుంచే అమల్లోకి రానున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు ఈ పథకాన్ని పేరొందిన ఇన్సురెన్స్ సంస్థ ద్వారా (తక్కువ ప్రీమియం ఉండేలా) అమలు చేయాల్సిందిగా స్త్రీనిధి ఎండీని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు పంచాయతీ రాజ్‌శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీచేశారు.

లోన్ బీమా కూడా వర్తింపు

అదేవిధంగా బ్యాంక్ లింకేజీ ప్రోగ్రాం కింద 64.35 లక్షల ఎస్‌హెచ్‌జీ సభ్యులకు (గ్రామీణ, పట్టణ) క్రెడిట్ లింక్డ్ రిస్క్ కవరేజీ (లోన్ బీమా)ని వర్తింపజేస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. రుణాలు తీసుకున్న సభ్యుల్లో ఎవరైనా చనిపోతే గరిష్టంగా రూ.2 లక్షల వరకు రిస్క్ కవరేజీ ఇచ్చేలా చర్యలు తీసుకోనున్నారు. ఈ పథకం కూడా గురువారం నుంచి అమల్లోకి వచ్చినట్టు ప్రకటించారు. ఈ మేరకు పీఆర్ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా విడిగా ఉత్తర్వులు జారీచేశారు.

కొత్త బాసు రాకముందే ఖాళీ చేయాలని..!

ట్యాపింగ్ ఆధారాలను ధ్వంసం చేసే కుట్ర చేసిన ఎస్‌ఐబీ ఓఎస్డీ ప్రభాకర్‌రావు

- ఎన్నికల ఫలితాలు రావడంతో డిసెంబర్ 4న రాజీనామా
- అదే రోజు రాత్రి ప్రణీత్‌రావును ఎస్‌ఐబీకి పంపిన వైనం
- ట్యాపింగ్ కేసులో దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు
- త్వరలో ప్రభాకర్‌రావు సహా మరికొందరికి నోటీసులు



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో అధికార బీఆర్‌ఎస్ పార్టీ ఓడిపోవడం... ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్డీ) హోదాలో అప్పటివరకు స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరోకు (ఎస్ఐబీ) నేతృత్వం వహించిన టి.ప్రభాకర్‌రావు రాజీనామా చేయడం ... త్వరలో ఆ విభాగానికి మరో బాస్ వచ్చే అవకాశం ఉండటం... ఈ పరిణామాల నేపథ్యంలోనే గత డిసెంబర్ 4న రాత్రి ఎస్ఐబీ ఆఫీస్‌లోని 'వార్ రూమ్'ను మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు ధ్వంసం చేసినట్లు అధికారులు గుర్తించారు. ప్రణీత్‌ను బుధవారం జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించిన పంజగుట్ట పోలీసులు తదుపరి విచారణ కోసం కస్టడీకి కోరుతూ గురువారం నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను వెనక్కు ఇచ్చిన న్యాయస్థానం అదనపు పత్రాలతో శుక్రవారం మళ్లీ దాఖలు చేయాలని ఆదేశించింది.

డీఎస్పీగా చేరి ఓఎస్డీగా రాజీనామా...

1991లో డీఎస్పీగా పోలీసు విభాగంలో అడుగుపెట్టిన టి.ప్రభాకర్‌రావు 2001లో ఐపీఎస్ హోదా పొంది ఐజీగా పనిచేస్తూ 2020 జూన్‌లో పదవీ విరమణ పొందారు. అదే ఏడాది నవంబర్ 3న ప్రభాకర్‌రావును ఓఎస్డీ హోదాలో ఎస్ఐబీలో నియమించారు. అప్పట్లో నిఘా విభాగానికి నేతృత్వం వహించిన నవీన్ చంద్ పదవీ విరమణ చేయడంతో తాత్కాలికంగా ఆ బాధ్యతల్నీ ప్రభాకర్‌రావుకే అప్పగించారు. అప్పటి నుంచే ఈ అక్రమ ట్యాపింగ్ వ్యవహారాలకు బీజం పడిందని అనుమానిస్తున్నారు. నిఘా విభాగానికి అనిల్ కుమార్‌ను బాస్‌గా నియమించిన అప్పటి ప్రభుత్వం ప్రభాకర్‌రావును ఎస్ఐబీకి పరిమితం చేసింది. అప్పటి నుంచి ఎక్స్‌టెన్షన్‌పై కొనసాగుతూ వచ్చిన ప్రభాకర్‌రావు గత డిసెంబర్ 4న రాజీనామా చేశారు.

ఒకట్రెండు రోజుల్లో ఎస్ఐబీకి మరో అధికారిని నియమించే అవకాశం ఉండటంతో తమకు ఇబ్బంది లేకుండా, తక్షణం ట్యాపింగ్‌కు సంబంధించిన ఆధారాలు చెరిపేయాలని ప్రణీత్ రావుకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో వార్ రూమ్‌లు ఖాళీ చేసి, ట్యాపింగ్ ఆధారాలు ధ్వంసం చేయడానికి ఇతడు సిద్ధమైనట్లు పోలీసులు చెప్తున్నారు.

హార్డ్‌డిస్క్‌ల్ని కట్టర్లతో కట్ చేశారు

ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు ప్రణీత్ ఓ ఎలక్ట్రీషియన్‌తో కలిసి ఎస్ఐబీ కార్యాలయంలోకి వెళ్లాడు. అక్కడ వార్ రూమ్‌తోపాటు అధికారిక ట్యాపింగ్స్ జరిగే లాగర్ రూమ్ దగ్గర సీసీ కెమెరాలను ఆఫ్ చేయించాడు. 17 కంప్యూటర్లలో ఉన్న వాటితోపాటు విడిగా భద్రపరిచిన 50 హార్డ్‌డిస్క్‌ల్నీ ధ్వంసం చేయడానికి ఉపక్రమించాడు. ఎలక్ట్రీషియన్ తోపాటు నమ్మినబంటుగా ఉన్న ఓ పోలీసు సహాయంతో ఎలక్ట్రిక్ కట్టర్ వినియోగించి ఈ హార్డ్‌డిస్కులు ధ్వంసం చేశాడు. ఎస్ఐబీ అనునిత్యం మావోయిస్టులకు సంబంధించిన సమాచారం సేకరిస్తూ, వారిపై నిఘా ఉంచుతుంది. ఈ నేపథ్యంలోనే మావోయిస్టుల తోపాటు వారి సానుభూతిపరులు, వారితో వివి ధ రకాలైన సంబంధాలు కలిగిన వారి వివరా లను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ నిక్షిప్తం చేస్తుంటుంది. ఎస్ఐబీ దృష్టిలో ఇది అత్యంత విలువైన డేటా. ప్రణీత్ ధ్వంసం చేసిన హార్డ్‌డిస్క్‌ల్లో ఈ డేటా ఉందని, ఇప్పుడు దాన్ని తిరిగి పొందటం సాధ్యం కాదని అధికారులు చెప్తున్నారు. ఆ కోణంలోనూ ప్రణీత్‌ను విచారించనున్నారు. ప్రణీత్‌ను పోలీసు కస్టడీలోకి తీసుకుని విచారించిన తర్వాత ప్రభాకర్‌రావు సహా మరికొందరికి నోటీసులు జారీ చేయాలని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు.

రైతులు, నిరుద్యోగుల ఆస్తులు తాకట్టు పెట్టుకోవద్దు

- బ్యాంకర్లకు డిప్యూటీ సీఎం భట్టి సూచన
- రైతుల విషయంలో మానవతా దృక్పథంతో వ్యవహరించండి
- ఎస్‌హెచ్‌జీల మహిళలకు ఎక్కువ రుణాలివ్వండి
- మంత్రి తుమ్మలతో కలిసి ఎస్‌ఎల్‌బీసీ భేటీకి హాజరు



సాక్షి, హైదరాబాద్: రైతులు, నిరుద్యోగులకు రుణాలు ఇచ్చే విషయంలో బ్యాంకర్లు వారి ఆస్తులను తాకట్టు పెట్టుకోవడం సరైంది కాదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రైతుల విషయంలో బ్యాంకులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా బ్యాంకర్లు వారికి ఎక్కువ రుణాలు ఇవ్వాలని కోరారు. స్వయం ఉపాధి కోసం యువతకు కూడా రుణాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గురువారం బేగంపేటలోని ఒక ప్రైవేట్ హోటల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్‌ఎల్‌బీసీ) 40వ త్రైమాసిక సమావేశానికి వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి భట్టి హాజరయ్యారు. ఈ సందర్భంగా బ్యాంకర్లను ఉద్దేశించి మాట్లాడారు.

రుణ వితరణ సామాజిక బాధ్యతగా గుర్తించాలి

రుణాలు ఇవ్వడం సామాజిక బాధ్యతగా బ్యాంకర్లు గుర్తించాలని భట్టి విజ్ఞప్తి చేశారు. సంపద సృష్టికర్తలకు బ్యాంకర్లు తోడ్పాటు ఇవ్వడం వల్ల సంపదను ప్రజలకు పంచవచ్చని వివరించారు. రైతులకు రుణాలు ఇచ్చే విషయంలో బ్యాంకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ అసహనం ప్రదర్శిస్తే వారు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి రుణ భారం తీరక ఆత్మహత్యలకు పాల్పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. గత పాలనలో లావాదేవీలు జరగని ఖాతాలకు సంబంధించిన రైతులకు మళ్లీ రుణాలు ఇవ్వాలని చెప్పారు. రానున్న ఐదేళ్లలో డ్వాక్రా సంఘాల మహిళలకు రూ.లక్ష కోట్ల వడ్డీ రహిత రుణాలు అందించాలని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. వ్యాపారంలో విఫలమైన ఈము రైతులకు రుణాల చెల్లింపుల విషయంలో వన్ టైం సెటిల్మెంట్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. తాను ఆంధ్రా బ్యాంకు డైరెక్టర్‌గా ఉన్న సమయంలో విద్య రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డులు ప్రారంభం అయ్యాయని, 20 ఏళ్లు అవుతున్నా ఆ రుణాల జారీలో ప్రగతి కనిపించడం లేదని అన్నారు.

ప్రభుత్వ పథకాలకు సహకరించండి: తుమ్మల

ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాల్లో ప్రజా ప్రాధాన్యత ఉన్న వాటిని గుర్తించి వాటిని ముందుకు తీసుకెళ్లడానికి బ్యాంకర్లు సహకరించాలని మంత్రి తుమ్మల కోరారు. రుణాలు ఇచ్చే విషయంలో వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పాడి పరిశ్రమలు నెలకొల్పడానికి ముందుకు వచ్చే రైతులకు బ్యాంకర్లు రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలని సూచించారు. ఈ సందర్భంగా పట్టు గూళ్ల పెంపకం రైతులకు రూ.1.83 కోట్ల ప్రోత్సాహక చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఎస్‌బీఐ సీజీఎం రాజేష్‌కుమార్, ఎస్‌ఎల్‌బీసీ కన్వీనర్ మిత్ర, నాబార్డ్ జీఎం పీపీ ఉషా తదితరులు పాల్గొన్నారు.

రూ. 49,501 కోట్ల పంట రుణాలు: ఎస్‌ఎల్‌బీసీ

రాష్ట్రంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో రైతులకు రూ.49,501 కోట్ల పంట రుణాలు ఇచ్చినట్లు ఎస్‌ఎల్‌బీసీ వెల్లడించింది. లక్ష్యంలో 67.41 శాతం చేరుకున్నట్లు గురువారం విడుదల చేసిన నివేదికలో తెలిపింది. రూ.624 కోట్ల మేర విద్యా రుణాలు, రూ.2,890 కోట్ల గృహ రుణాలు ఇచ్చినట్లు తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంకుల మొత్తం డిపాజిట్లు రూ.7,55,800 కోట్లకు చేరాయని వివరించింది.

సింగరేణిలో సేఫ్టీ 'నోమ్'

- భూగర్భ గనుల్లో ప్రమాదాల నివారణకు ఆస్ట్రేలియా టెక్నాలజీ వినియోగం
- ప్రయోగాత్మకంగా ఒక గనిలో అమలుకు అంగీకారం
- వివరాలు వెల్లడించిన సింగరేణి సీఎండీ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: భూగర్భ గనులను నూరుశాతం ప్రమాదరహితంగా మార్చేందుకు 'సింగరేణి' అంతర్జాతీయస్థాయి ఆధునిక సాంకేతికతను పరిశీలిస్తోందని సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ తెలిపారు. భూగర్భగనుల్లో పైకప్పు కూలి జరిగే ప్రమాదాలను నివారించడానికి ఆస్ట్రేలియాకు చెందిన నోమ్ అనే సంస్థ కొత్తగా రూపొందించిన ఆధునిక పరికరాల పనితీరును హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం సంస్థ ఉన్నతస్థాయి అధికారులతో చర్చించారు. భూగర్భగనుల్లో రక్షణ చర్యలెన్ని తీసుకుంటున్నా, అకస్మాత్తుగా పైకప్పు కూలి కార్మికులు మృతి చెందిన ఘటనలు గతంలో అనేకం జరిగాయని ఈ సమావేశంలో అధికారులు అభిప్రాయపడ్డారు.



ఆస్ట్రేలియాకు చెందిన నోమ్ సంస్థ రూపొందించిన యంత్రం పనితీరును తెలుసుకుంటున్న సింగరేణి సీఎండీ ఎన్ బలరాం

నోమ్ సంస్థ రూపొందించిన పరికరం గనిలో పైకప్పు ప్రమాదం జరగకముందే ఫ్లాష్ లైటింగ్, సైరన్‌ల ద్వారా అక్కడ పనిచేస్తున్న కార్మికులు, అధికారులను హెచ్చరించి అప్రమత్తం చేస్తుందని, దీంతో ప్రమాదం నివారించేందుకు అన్నిరకాల చర్యలు తీసుకొని, ప్రాణనష్టం జరగకుండా చూసే అవకాశం ఏర్పడుతుందని అన్నారు. ఈ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏదైనా ఒక భూగర్భగనిలో వినియోగిస్తామని, అక్కడ వచ్చే ఫలితాల ఆధారంగా తదుపరి నిర్ణయం తీసుకుంటామని సీఎండీ వెల్లడించారు. ఈ సమావేశంలో డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ జి.వెంకటేశ్వర్ రెడ్డి, జనరల్ మేనేజర్ (ఆర్అండ్‌డీ) సుభాని తదితరులు పాల్గొన్నారు. కాగా నోమ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నాథన్‌టవెన్, జనరల్ మేనేజర్ కేసన్‌ఫిన్‌లెన్ డెమోస్ట్రేషన్ ద్వారా యంత్రం పనితీరు గురించి అధికారులకు వివరించారు.

ఆ విలేకరులను క్షమించేది లేదు – టీయూడబ్ల్యూజే, ఐజేయూ

సాక్షి, హైదరాబాద్: గొలుసు కట్టు మనీ స్కీమ్‌కు ఒక కుటుంబం బలైన దుర్ఘటనలో కొంతమంది విలేకరుల పాత్ర ఉండటం అత్యంత విచారకరమని తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే), ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) పేర్కొన్నాయి. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలంలోని టంగుటూరు గ్రామంలో జరిగిన ఘటన మీడియాలోని ప్రతి ఒక్కరూ తలదించుకునేలా చేసిందని ఆ సంఘాలు విచారం వ్యక్తం చేశాయి. మీడియా ప్రమాణాలను, గౌరవాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీయూడబ్ల్యూజే, ఐజేయూ గురువారం విడుదల చేసిన ప్రకటనలో విజ్ఞప్తి చేశాయి. వాస్తవాలను రాయకుండా ఉండడానికి ఒక వ్యక్తి వద్ద డబ్బులు డిమాండ్ చేసిన విలేకరులు వృత్తికి ద్రోహం చేయడమే గాకుండా ఆ క్రమంలో నలుగురి ప్రాణాలు పోవడానికి కారకులయ్యారని టీయూడబ్ల్యూజే అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నగునూరి శేఖర్, కె.విరాహత్ అలీ, ఐజేయూ కార్యదర్శి వై నరేందర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

'కడెం'ను గత ప్రభుత్వం పట్టించుకోలేదు

- ఖానాపూర్ ఎమ్మెల్యే, వెడ్మ బొజ్జుపటేల్
- ప్రాజెక్టుకు మరమ్మతు పనులు ప్రారంభం

కడెం: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కీలక ప్రాజెక్టు అయిన కడెంను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి రూ.5.46 కోట్లు మంజూరు చేసి ప్రాజెక్టుకు మరమ్మతులు చేయిస్తోందని తెలిపారు. ప్రాజెక్టు మరమ్మతు పనులను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన కడెం ప్రాజెక్టు ఇప్పటికీ చెక్కు చెదరలేదన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో డేంజర్ జోన్‌లోకి వెళ్లిందని అన్నారు. ప్రాజెక్టు నిర్వహణను కూడా బీఆర్ ఎస్ సర్కార్ గాలికి వదిలేసిందని ఆరోపించారు. దీని ఫలితంగా ప్రాజెక్టు ఆయకట్టు రైతులు క్రాప్ హాలిడే ప్రకటించాల్సి వచ్చిందని తెలిపారు. ప్రాజెక్టు నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కడెం ఆయకట్టు రైతాంగం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కడెం ఎగువన కుప్టి ప్రాజెక్టు నిర్మాణం, 25 గేట్లతో కడెం ప్రాజెక్టు పునర్నిర్మాణం అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ అలెగ్జాండర్, ఈఈ విఠల్, డీఈ బోజదాసు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు దుర్గభవాని, మండలాధ్యక్షుడు మల్లేశ్, పట్టణాధ్యక్షుడు వాజిద్‌ఖాన్, భూమేశ్, వెంకటేశ్, సాగర్, సత్తెన్న, రఫీక్, సత్యం చారి, భూషణ్, తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్



వరద గేట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

చెట్లపొదల్లో నవజాత శిశువు

- ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం నిపాని శివారులో ఘటన
- శిశుగృహకు తరలించిన అధికారులు

తాంసి: నవజాత శిశువును ఎవరో పంటచేనులో వదిలివెళ్లిన అమానవీయ ఘటన ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం నిపాని గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం వేకువజామున 5గంటలకు నిపాని గ్రామానికి చెందిన గంగమ్మ సమీపంలోని పంటచేను వద్దకు బహిర్భూమికి వెళ్లగా పసికందు ఏడుపు వినిపించింది. వెంటనే ఆమె పొదల్లో పడి ఉన్న మగశిశువును గుర్తించింది. ఆమె సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న గ్రామస్తులు శిశువును అక్కున చేర్చుకున్నారు. గ్రామంలోకి తీసుకువెళ్లి స్నానం చేయించి పాలు పట్టారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్సై ప్రదీప్‌కుమార్ గ్రామానికి చేరుకున్నారు. శిశువును మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్యపరీక్షలు చేయించారు. అనంతరం అంబులెన్స్‌లో తరలించి శిశుగృహ అధికారులకు అప్పగించారు. కాగా, మహారాష్ట్ర నుంచి అంతర్రాష్ట్ర రహదారిపై వెళ్లేవారెవరైనా శిశువును వదిలి వెళ్లి ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. కాగా, శిశువు లభించిన స్థానంలో మహిళ ప్రసవించిన ఆనవాళ్లు ఉన్నాయి.




పంటచేనులో శిశువు



శిశుగృహ సిబ్బందికి అప్పగిస్తున్న అధికారులు

జీడీకే-5 ఓసీపీకి మరో 30 ఏళ్ల భవిష్యత్!



జీడీకే-5 ఓసీపీ



బెల్ట్‌ద్వారా బయటకు వస్తున్న బొగ్గు

- పంచ్‌ఎంట్రీ తరహాలో ఓసీపీ
- ప్రస్తుత ఓసీపీకి తగ్గిన జీవితకాలం
- ప్రణాళికలు సిద్ధం చేస్తోన్న యాజమాన్యం

గోదావరిఖని(రామగుండం): జిల్లాలో బొగ్గునిల్వలు అడుగంటిపోతున్నాయి. ఉత్పత్తి లక్ష్యాలను పెంచుకుంటూ వెళ్తున్న యాజమాన్యం దానికి తగ్గట్టుగా విస్తరణ లేకపోవడంతో గనుల మూసివేతకు దారి తీస్తోంది. ఇటీవలే గోదావరిఖని సమీపంలో ఏర్పాటైన జీడీకే-5ఓసీపీ పరిస్థితి అలాగే తయారైంది. మరో 8ఏళ్లలో బొగ్గు నిల్వలు పూర్తయి కాలగర్భంలో కలిసిపోనుంది. వాస్తవానికి 14ఏళ్ల జీవిత కాలం లక్ష్యంగా ఈ ప్రాజెక్టును రూపొందించారు. ఏటా వార్షిక లక్ష్యాలు పెంచుకుంటూ వెళ్తుండటంతో బొగ్గు నిల్వలు అడుగంటిపోతున్నాయి. నాలుగేళ్ల ముందుగానే ఈ ప్రాజెక్టులో బొగ్గు నిలవ్రలు పూర్తికానున్నాయి. ఈక్రమంలో ఈప్రాంతంలో బొగ్గుగని జీవితకాలం పెంచేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. జీడీకే-5 ఓసీపీ క్వారీలో 300 మీటర్ల లోతులో పంచ్‌ఎంట్రీ ఏర్పాటు చేసి 600 మీటర్ల లోతు వరకు ఉన్న బొగ్గును వెలికితీసేందుకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు. అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టు తరహాలో భూమిపొరల్లో ఉన్న బొగ్గును వెలికితీయడం ప్రారంభిస్తే జీడీకే-5 ఓసీపీకి మరో 30ఏళ్ల భవిష్యత్ ఉంటుందని పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఉన్న ఎనిమిదేళ్ల జీవిత కాలంతో పాటు మరో 30 ఏళ్లు కలిస్తే 38 ఏళ్లపాటు ఈ ప్రాజెక్టు ఢోకా ఉండబోదని నిపుణులు చెబుతున్నారు.

ప్రతిపాదిత ప్రాజెక్టు పేరు: పంచ్‌ఎంట్రీ
టెక్నాలజీ : కంటిన్యూస్ మైనర్
జీవితకాలం: సుమారు 30 ఏళ్లు
బొగ్గు నిల్వలు: 40 మిలియన్ టన్నులు
ఏటా ఉత్పత్తి: ఒక మిలియన్ టన్ను
అంచనా వ్యయం: రూ.150 కోట్లు


డిమాండ్ పెరగడంతో..

గోదావరిఖని సమీపంలో 14ఏళ్ల జీవిత కాలం లక్ష్యంగా జీడీకే-5 ఓసీపీని భూగర్భగనుల స్థానంలో ఏర్పాటు చేశారు. అయితే ప్రతిపాదనలు రూపొందించిన సమయంలో ఉత్పత్తి లక్ష్యం తక్కువగా కేటాయించినప్పటికీ విద్యుత్‌సంస్థల నుంచి డిమాండ్ పెరుగుతుండటంతో వార్షిక లక్ష్యాలను అనూహ్యంగా పెంచారు. దీంతో జీవిత కాలం పదేళ్లకే పరిమితం అయ్యింది. ఆ తర్వాత ఓసీపీ మూసివేసే పరిస్థితి ఏర్పడింది.

పంచ్‌ఎంట్రీ పేరుతో కొత్త గని

అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టు తరహాలో పంచ్ ఎంట్రీ ద్వారా భూగర్భగని ఏర్పాటు చేయాలని ప్రణాళికలు మొదలయ్యాయి. ఓసీపీ లోపల 300 మీటర్ల లోతులో ఐదు సొరంగాలు ఏర్పాటు చేసి అక్కడ నుంచి 600మీటర్ల లోతువరకు బొగ్గును వెలికితీయాలనే ఆలోచనలో ఉన్నారు. ఇది ఆచరణ రూపం దాల్చితే మరో 30ఏళ్ల భవిష్యత్ పెరగనుంది. ప్రాథమికంగా దీనిపై నివేదికలు ఉన్నతస్థాయికి వెళ్లినట్లు తెలుస్తోంది. రామగుండం రీజియన్‌లో భూగర్భగనులు రోజురోజుకు తగ్గిపోతుండటం, పారిశ్రామిక ప్రాంతంలో కార్మికులు తగ్గుతున్న క్రమంలో యాజమాన్యం తీసుకునే ఈనిర్ణయంతో మరో 30 ఏళ్ల భవిష్యత్ ఉండనుంది.

రిమ్స్‌లో ముక్కు మూసుకోవాల్సిందే..











ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. గుత్తేదారు నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో పలు వార్డుల్లో చెత్తాచెదారం రోజుల తరబడి పేరుకుపోతోంది. పైగా ఆస్పత్రికి వచ్చే రోగులు ఎక్కడపడితే అక్కడ ఉమ్మి వేస్తుండటంతో దుర్గంధం వ్యాపిస్తోంది. ఫలితంగా ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

నేడు 'షరతులు వర్తిస్తాయి' విడుదల

- సినిమా దర్శకుడు గోదావరిఖనివాసి





సినిమా పోస్టర్, చిత్ర నటులతో దర్శకుడు కుమారస్వామి (మధ్యలో)

కరీంనగర్ కల్చరల్: కరీంనగర్ యాస, భాష ఎంచుకొని, మధ్యతరగతి మనుషుల జీవితాలను, తాను పడిన, చూసిన కష్టనష్టాలను, సంతోషాలను ఇతివృత్తంగా గోదావరిఖనికి చెందిన రచయిత, దర్శకుడు కుమారస్వామి(అక్షరకుమార్) స్టార్ లైట్ స్టూడియో బ్యానర్‌లో 'షరతులు వర్తిసాయి' అనే చిత్రాన్ని తెరకెక్కించాడు. ఈ సినిమా శుక్రవారం విడుదల కానుంది. చిత్రీకరణ హీరో, హీరోయిన్‌ల ఇళ్లున్న కరీంనగర్‌లోని సుభాష్‌నగర్‌లో, చల్మెడ ఆనందరావు ఆస్పత్రి, ఎల్ఎండీ కాలనీ, శుభమంగళ ఫంక్షన్‌హాల్, వివేకానంద హైస్కూల్, భాగవతి స్కూల్, కిసాన్‌నగర్ ప్రాంతాల్లో జరిగింది. ఇది ఆద్యంతం విజ్ఞానం, వినోదం పంచే సినిమాగా నిలుస్తుందని చిత్ర యూనిట్ తెలిపింది.

మంచి సినిమా.. ఆదరించండి

కరీంనగర్ ఎన్నో ఉద్యమాలకు, త్యాగాలకు, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక. షరతులు వర్తిస్తాయి సినిమా మీ సమయాన్ని, డబ్బును వృథా చేయదు. ఇది సామాన్యుల బతుకు చిత్రం. మంచి సినిమా.. ప్రేక్షకులు ఆదరించాలి. తెలంగాణ సినిమాను నిలబెట్టాలి.

– కుమారస్వామి, రచయిత, దర్శకుడు

వృద్ధురాలి ఆభరణాలు చోరీ

కరీంనగర్ క్రైం: మాయమాటలు చెప్పి, గుర్తు తెలియని వ్యక్తులు ఓ వృద్ధురాలి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. కరీంనగర్ టూ టౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. నగరంలోని సప్తగిరికాలనీకి చెందిన గంగిపెల్లి బాలయ్య మంకమ్మతోటలో ఇస్త్రీ షాప్ నిర్వహిస్తున్నాడు. గురువారం ఉదయం ఆయనకు భోజనం ఇవ్వడానికి భార్య శంకరమ్మ వెళ్తోంది. దారిలో ఇద్దరు యువకులు కలిసి.. పోలీసులు తనిఖీ చేసి, బంగారం తీసుకుంటున్నారని, తమకు ఇస్తే వారిని దాటగానే ఇచ్చేస్తామని నమ్మించారు. దీంతో ఆమె తన వద్ద ఉన్న రూ.90 వేల విలువైన పుస్తెల తాడు, ఉంగరం ఇచ్చేసింది. వారు వెంటనే బైక్‌పై పారిపోయారు. తర్వాత దొంగలని గుర్తించిన శంకరమ్మ అరవడంతో స్థానికులు వచ్చి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటన స్థలానికి చేరుకొని, సీసీ కెమెరాలను పరిశీలించగా ఇద్దరు యువకులు బైక్‌పై వెళ్తూ కనిపించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.